# తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (TJAC)

## విస్తృతస్థాయి స్టీరింగ్ కమిటీ సమావేశము

25 డిసెంబర్ 2016, ఆదివారము

యం.ఎన్. కన్వెన్షన్ సెంటర్, కర్మన్‌ఘాట్, హైదరాబాద్

---

## తీర్మాణాలు

### పంచశీల

టీజేయేసీ సభ్యులు పాటించవలసిన ప్రవర్తనానియమావళి

1. కుల, మత, లింగ, హోదా, ప్రాంత, స్థితి వ్యత్యాసాలను పాటించరాదు. సాటి మనుషులను మనుషులుగా గౌరవించాలి.

2. సభ్యులు ఒకరిపై ఇంకొకరు చులకనగా మాట్లాడరాదు.

3. సభ్యులమధ్యన వివిధ అంశాలపై తలెత్తే విబేధాలను సామరస్యపూర్వకంగా చర్చించిప్రజాస్వామ్య పద్ధతిలో పరిష్కరించుకోవాలి.

4. నిధుల వసూళ్ల విషయంలో జవాబుదారీతనం, పారదర్శక పద్ధతుల్లో వ్యవహరించాలి.

5. సభ్యులు మద్యపానానికి దూరంగా ఉండాలి.

------------------

- శాస్త్రీయ అధ్యయనం లేకుండా చేపట్టిన విద్యుత్, సాగునీటి ప్రాజెక్టుల కారణంగా వేలకోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం కావడమే కాకుండా, ప్రజలు పెద్ద ఎత్తున భూమిని కోల్పోయి తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. విద్యుత్ సాగునీటి ప్రాజెక్టులను సమగ్రంగా సమీక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.
- 2013 భూసేకరణ చట్టానికి ప్రభుత్వం తలపెట్టిన సవరణల బిల్లు, అనేక పోరాటాల ఫలితంగా ఏర్పడిన 2013 భూసేకరణ చట్టస్ఫూర్తిని తూట్లుపొడిచే విధంగా ఉంది. ఈ బిల్లును ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలి.
- కాంట్రాక్టు, ఒప్పంద కార్మికులు సర్వీసులను క్రమబద్దీకరించే విషయంలో, తెలంగాణ ఏర్పడి రెండున్నరసంవత్సరాలు పూర్తి అయినప్పటికీ ఏ మాత్రం పురోగతిలేదు. క్లాస్-3, క్లాస్-4 కాంట్రాక్టు, ఒప్పంద కార్మికుల సర్వీసులను నియమిత కాలంలో క్రమబద్ధీకరించాలి.
- ప్రజలు కేంద్రంగా అభివృద్ధిని సాధించాలంటే రాజ్యాంగ విలువల ప్రకారం ప్రజాప్రతినిధులు తమ విధులను, కర్తవ్యాలను నిర్వహించాల్సిన అవసరం ఉన్నది. పదవులకోసం అవకాశవాద రాజకీయాలను ఆశ్రయించే ప్రజాప్రతినిధులను ప్రజాప్రాతినిధ్య చట్టంలోని నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని టీజేయేసీ డిమాండు చేస్తున్నది. రాజ్యాంగంలోని షెడ్యూల్ 10, పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టంలోని నిబంధల ప్రకారం స్పీకర్ తన విధులను నిర్వర్తించి ప్రజాస్వామిక విలువలను నిలబెట్టాలి.
- ప్రభుత్వంలో ప్రజాసమస్యల పరిష్కారానికి సంబంధించిన 'సిటిజన్స్ చార్టర్ ఆఫ్ రైట్స్' నిబంధనలను ఖచ్చితంగా అమలు జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ నిర్వహణలోని బాధ్యులకు ఈ విషయంలో జవాబుదారీతనంతో వ్యవహరించేవిధంగా చూడాలి.
- విద్యా, ఉద్యోగ రంగాల్లో కొనసాగుతున్న 'జోనల్ వ్యవస్థ'ను ఏకపక్షంగా రద్దుచేయాలనే నిర్ణయం సరికాదు. ఈ అంశంపై నిపుణుల కమిటీని నియమించి, విస్తృత ప్రజాభిప్రాయాని సేకరించినతర్వాత మాత్రమే సరియైన నిర్ణయం తీసుకోవాలని టీజేయేసీ డిమాండు చేస్తున్నది.
- ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్‌లకు చెల్లించాల్సిన తొమ్మిదినెలల ' పీఆర్సీ' బకాయిలను, ప్రత్యేకంగా పెన్షనర్‌లకు చెల్లించాల్సిన గ్రాట్యుటీ బకాయలను వెంటనే చెల్లించాలి. 70 ఏండ్ల వయస్సుదాటిన పెన్షనర్‌లకు పూర్తి పెన్షన్ పునరుద్ధరించాలి. 15 శాతం అదనపు పెన్షన్ సౌకర్యాన్ని75 నుండి 70సంవత్సరాల వయస్సుకు తగ్గించాలి. విద్యారంగంలో పెండింగ్‌లో ఉన్న సర్వీస్‌రూల్స్ వెంటనే పున రుద్ధరించాలి. సకలజనులసమ్మెలో పాల్గొని రిటైర్ అయిన ఉద్యోగులకు తెలంగాణ ఇంక్రిమెంట్ అమలుపరచాలి.

- విద్యుత్ ఛార్జీల బకాయిల పేరుతో ట్రాన్స్‌ఫార్మర్ క్రిందఉన్న రైతులందరికీ విద్యుత్ నిలిపివేసే పద్ధతిని తక్షణం నిలిపివేయాలి. రైతుల విద్యుత్ బకాయలను పూర్తిగా రద్దుచేయాలి.
- ఉద్యోగుల వేతనం నుండి ప్రతినెలా 10శాతం సొమ్మును మినహాయించి, దానికి సమానమైన మొత్తాన్ని ప్రభుత్వవాటాగా జమచేసి షేర్ మార్కెట్‌లో పెట్టుబడిగాపెట్టి వచ్చేలాభాలపై ఆధారపడి చెల్లించే నూతన పెన్షన్ విధానం సరియైనదికాదు. ఇది ఉద్యోగ సామాజిక భద్రతపై తీవ్రమైన ప్రభావం చూపుతుంది. కొత్త రాష్ట్రం ఏర్పాటైన నేపథ్యంలో కేంద్ర అనుమతితో రాష్ట్ర ప్రభుత్వం సి.పి.ఎస్. స్థానంలో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి.
- రాష్ట్రంలో పాఠశాల, కళాశాల, వృత్తి, ఉన్నతవిద్యను కార్పోరేటీకరణ చేసే ప్రయత్నాలను టీజేయేసీ పూర్తిగా వ్యతిరేకిస్తున్నది. అందులో భాగంగానే రాష్ట్రప్రభుత్వం ప్రైవేటు విశ్వవిద్యాలయాల చట్టాన్ని తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నదని టీజేయేసీ భావిస్తున్నది. ప్రభుత్వం ప్రతిపాదించిన ఈ చట్టం ఫలితంగా పేద, బలహీనవర్గాలకు ఉన్నతవిద్యావకాశాలు అడుగంటిపోతాయి. స్కాలర్‌షిప్‌లు, రిజర్వేషన్‌లు కోల్పేయే ప్రమాదం ఉన్నది. రాష్ట్రంలోని ప్రైవేటు విద్యాసంస్థలకు ఇవ్వాల్సిన ఫీజుల రియంబర్స్‌మెంట్ బకాయలను వెంటనే పూర్తిగా చెల్లించాలి.
-రాష్ట్రంలో ప్రజారోగ్యవ్యవస్థను బలోపేతం చేయడానికి నియమిత కాలపరిమితిలో 'ప్రత్యేక వైద్యవిధానాన్ని' రూపొందించి ప్రకటించాలి. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులందరూ ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే వైద్యసౌకర్యాన్ని పొందేవిధంగా ప్రభుత్వం నిబంధనలు రూపొందించాలని టీజేయేసీ డిమాండు చేస్తున్నది.
- రాష్ట్రంలోని అటవీప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసీలు అనేక సంవత్సరాలుగా పోడువ్యవసాయం జీవనాధారంగా బ్రతుకుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం 'హరితహారం' పేరుతో ఆదివాసీలు అనుభవిస్తున్న పోడుభూములను బలవంతంగా గుంజుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలను టీజేయేసీ వ్యతిరేకిస్తున్నది. ఆదివాసీ, గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధికోసం రాజ్యాంగంలోని ఐదవ, ఆరవ షెడ్యూల్‌లు, వన్ ఆఫ్ సెవెంటీ, పెసా చట్టం, అటవీహక్కుల చట్టాలను ప్రభుత్వమే ఉల్లంఘించడాన్ని టీజేయేసీ తప్పుపడుతున్నది.
- తెలంగాణ రాష్ట్రంలో నూటికి 60శాతం మందికి ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నది వ్యవసాయరంగమే! కానీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాల కారణంగా వ్యవసాయకుటుంబాలు తీవ్రమైన సంక్షోభం ఎదుర్కొంటున్నాయి. 2014 నుండి ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్రంలో సుమారు 2500మందికిపైగా రైతులు బలవన్మరణాలబారిన పడటం ఈ సంక్షోభతీవ్రతను సూచిస్తున్నది. ఈ సంక్షోభాన్ని నివారించి తెలంగాణ వ్యవసాయరంగాన్ని రక్షించేందుకు 'సమగ్ర వ్యవసాయ విధానాన్ని' ప్రకటించి అమలుపరచాలని టీజేయేసీ ఈ ప్రభుత్వాన్ని డిమాండు చేస్తున్నది. ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన రైతుల రుణమాఫీని పూర్తిగా ఒకేసారి అమలుచేయాలి. రైతురుణమాఫీ బకాయిలను వెంటనే చెల్లించాలి.
- తెగించి పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో మహిళల భాగస్వామ్యం కీలకమైనది. రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక సమానత్వం కల్పించడానికి కృషి చేయాలి. కేబినెట్‌లో కనీసం ఒక్క మహిళకు కూడా అవకాశం కల్పించకపోవడం అన్యాయం. మహిళలకు రక్షణ కల్పించడానికి కార్యాచరణ ప్రణాళికను ప్రకటించి అమలు చేయాలి. మహిళా రైతులు, కూలీలు, శ్రామికులు, అసంఘటిత రంగ కార్మికులు, నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలి. ఆదివాసీ, గిరిజన, దళిత, బహుజన, మైనారిటీవర్గాల మహిళలసాధికారికత, ఉపాధి కల్పన కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలి.
- తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను అడుగడుగునా ప్రత్యక్ష్యంగా, పరోక్షంగా అడ్డుతగిలిన సీమాంధ్ర ఆధిపత్యవర్గాలు, కాంట్రాక్టర్ల పెత్తనాన్ని తెలంగాణ ప్రాజెక్టుల నిర్మాణంలో లేకుండా తగిన చర్యలు తీసుకోవాలి.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో స్థానిక ప్రజలను భాగస్వాములను చేసేవిధంగా ప్రభుత్వం తగినవిధానాన్ని రూపొందించి అమలుపరచాలి.
- పరిశ్రమల్లో స్థానికులకే 100 శాతం రిజర్వేషన్‌ను అమలుచేయాలి. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపరచేందుకు ప్రభుత్వం ఒక ప్రత్యేక విధానాన్ని రూపొందించి ప్రకటించాలి.ఉపాధి అవకాశాలు కేంద్రంగా రాష్ట్ర బడ్జెట్ రూపకల్పన జరగాలి. మూసివేసిన చిన్న, సూక్ష్మ పరిశ్రమలను తెరిపించి ఉపాధిఅవకాశాలను మెరగుపరచాలి. ఉద్యోగ నియామకాలకు సంబంధించిన 'క్యాలండర్'ను రూపొందించి అమలుపరచాలి. రాష్ట్రంలో ఇప్పటికే గుర్తించిన ఉద్యోగ ఖాళీలన్నింటినీ నిర్ణీత కాలవ్యవధిలో పూరించాలి.
- రాష్ట్రంలో కునారిల్లిపోయిన కులవృత్తులను కాపాడేందుకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించి అమలుచేయాలి. కుటీర పరిశ్రమలకు అవసరమైన రుణసదుపాయాన్ని కల్పించాలి. డిఫాల్టర్‌లను వేధింపులకు గురిచేసే ప్రయత్నాలను మానుకోవాలి.